### విజయవాడకు
## మళ్లీ పూర్వ వైభవం

(మొదటి పేజీ తరువాయి)

స్వరాజ్య మైదానంతో తనకు ఎంతో అనుబంధం ఉందని.. ఇప్పుడు స్వరాజ్యం వచ్చింది కాబట్టి మైదానం తీసేసినట్టు ఉన్నారంటూ వ్యాఖ్యానించారు. నేటితరం ప్రజాప్రతినిధుల ఆలోచనల్లో మార్పులు రావాలని, చట్టసభల్లో మాట్లాడేటప్పుడు మంచి భాష ఉపయోగించాలని సూచించారు. రాజ్యసభ ఛైర్మన్‌ను సైతం ధిక్కరించి కొందరి సభ్యుల ప్రవర్తనపై స్పందించారు. సంప్రదాయాలు, ఉత్తమ సంస్కారం అనివార్యమన్నారు. రాష్ట్రంలోనూ ఆ పద్ధతి పాటించకుండా బూతులు మాట్లాడిన వారికి ఇటీవలి ఎన్నికల్లో తగిన గుణపాఠం ఎదురైందన్నారు.పార్టీలు వేరైనా అంతా ప్రత్యర్థులమే తప్ప శత్రువులు కాదనే భావన ఉండాలన్నారు. ప్రభుత్వ అధికారులు సైతం చట్టప్రకారం పనిచేయాలని.. ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు రాజ్యాంగాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యవహరించాలని సూచించారు. రాజధాని అమరావతి అభివృద్ధి ద్వారా విజయవాడకు మళ్లీ పూర్వ వైభవం, చైతన్యం వస్తుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, మంత్రులు కొలుసు పార్థసారథి, కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బోడే ప్రసాద్, వసంత కృష్ణప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావు, మండలి బుద్ధప్రసాద్, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రఘురామకృష్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌కు బిగ్‌డే


- నేడే ఎమ్మెల్సీ కవిత బెయిల్ పై వాదనలు!



**తెలంగాణవీణ/న్యూఢిల్లీ,ఆగస్టు 11:** ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఆరోపణలు ఎదుర్కొంటూ ఈడీ, సీబీఐ కేసులతో తీహార్ జైల్లో ఉన్న ఎమ్మెల్సీ కవిత బెయిల్ పిటిషన్ సోమవారం విచారణకు రానుంది. ఇప్పటికే కింది కోర్టుల్లో తన బెయిల్ పిటిషన్ కొట్టివేసిన నేపథ్యంలో, కవిత సుప్రీం కోర్టును ఆశ్రయించారు.కవిత పిటిషన్ పై సుప్రీం ద్విసభ్య బెంచ్ విచారణ జరపనుంది. జస్టిస్ గవాయి, జస్టిస్ విశ్వనాథన్ బెంచ్ ఢిల్లీ లిక్కర్ స్కాంలో కవిత బెయిల్ పిటిషన్ ను విచారించనుంది.17నెలల పాటు ఇదే కేసులో జైల్లో ఉన్న ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియాకు ఇదే బెంచ్ బెయిల్ మంజూరు చేసింది. కేసు విచారణ సందర్భంగా ఇంకా ఎంత కాలం ఓ వ్యక్తిని జైల్లో పెడతారు, ఇది ప్రాథమిక హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుంది. విచారణ త్వరగా పూర్తి చేయాల్సిందేనంటూ కామెంట్ కూడా చేసింది. దీంతో కవితకు బెయిల్ వస్తుందని బీఆర్ఎస్ నేతలంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న తరుణంలో ఇదే బెంచ్ మీదకు కవిత పిటిషన్ విచారణకు వస్తుండటంతో బెయిల్ వస్తుందన్న నమ్మకంతో ఆ పార్టీ నేతలున్నారు.పైగా, కేటీఆర్ కూడా వచ్చే వారం కవితకు బెయిల్ వస్తుంది అని నమ్మకంగా చెప్పారు. ఇప్పటికే సీనియర్ లాయర్లతో కేటీఆర్, హరీష్ రావులు చర్చలు జరిపారు. కేసును విచారించే ధర్మాసనం కూడా సిసోడియా కేసులో విచారణ జరిపి ఉన్న నేపథ్యంలో అదే రిజల్ట్ వస్తుందని భావిస్తున్నారు. మొత్తంగా సోమవారం బీఆర్ఎస్ కు బిగ్ డేగా మారనుంది.

## బీసీలు సంఘటితమైతే సాధించలేనిది ఏమీ లేదు

**తెలంగాణవీణ/హైదరాబాద్, ఆగస్టు 11:** కులాలుగా వేర్వేరు గుర్తింపు కలిగి ఉన్నప్పటికీ బీసీలుగా సంఘటిత శక్తిని ప్రదర్శిస్తే సాధించలేనిది ఏమీ లేదని తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావ్ అన్నారు.కులాలను అన్నిటిని ఐక్యం చేసే సిద్ధాంత భావజాల వ్యాప్తి జరగడం ఎంతైనా అవసరమని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం ఖైరతాబాద్ లోని మోడ్రన్ ఫంక్షన్ హాల్ లో బీసీ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా వేదిక రాష్ట్ర అధ్యక్షులు కాటం నరసింహ యాదవ్ వ్యవహరించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్రావు ఆత్మీయ అతిథులుగా శాంతి కుమార్, వెంకటేష్ గౌడ్ ఆంజనేయులు గౌడ్, తమ్మురు శ్రీరాములు, కోరే రాజ్ కుమార్ ,రుక్మిణి తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చిన వివిధ బీసీ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.డాక్టర్ వకుళాభరణం ప్రసంగిస్తూ ఉద్యమాన్ని దశల వారీగా నిర్మించాలన్నారు. మేధావులు, సామాజికవేత్తలు, విద్యావేత్తలు, కుల సంఘాల ప్రతినిధులు ఇతర స్థాయిలలోని ప్రతినిధులను ఏకం చేసి సమిష్టిగా "సిద్ధాంతం" ను రూపొందించాలన్నారు. అనవసర విమర్శలలతో కాలం వృథా చేయరాదన్నారు. నిర్మాణాత్మకంగా వ్యవహరించాలన్నారు."ఐక్యత"అనే సిద్ధాంత భావజాలం సంఘటితం కావాలని పిలుపునిచ్చారు.



# రైతు బాగుంటేనే.రాష్ట్రం బాగుంటుంది చంద్రబాబూ!

**తెలంగాణవీణ/అమరావతి,ఆగస్టు 11:** రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని గుర్తుపెట్టుకోండి చంద్రబాబూ అని సూచించారు వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్. ఈ మేరకు ఎక్స్‌లో ట్వీట్ చేసిన జగన్.023-24 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఉచిత పంట బీమా ప్రీమియంను ఇప్పటివరకూ చెల్లించలేదు.దీనివల్ల రైతులకు ఉచిత పంటలబీమా చెల్లింపులు నిలిచిపోయే ప్రమాదం ఏర్పడిందన్నారు.ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఉచిత పంటల బీమా ప్రీమియంను మా ప్రభుత్వ హయాంలో ప్రతి ఏటా ఏప్రిల్-మే నెలలో చెల్లించి నష్టపోయిన రైతులను జూన్‌లో ఆదుకున్నాం. ఖరీఫ్ పంట వేసే సమయానికి రైతులపై పైసా భారంపడకుండా ఉచిత పంటల బీమా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించి సమర్థవంతంగా అమలు చేశాం. రాష్ట్ర ప్రభుత్వం ప్రీమియం చెల్లించిన వెంటనే కేంద్రం కూడా వెంటనే తన వాటా కూడా విడుదలచేస్తుంది. ఇదిజరిగిన సుమారు 30 రోజుల్లోగా బీమా కంపెనీ పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లిస్తుంది. ఇదే మాదిరిగా మా ప్రభుత్వ హయాంలో 54.55 లక్షల మంది రైతులకు గతంలో ఎన్నడూలేని విధంగా రూ.7,802 కోట్లు అందించి వారికి అండగానిలిచాం. తద్వారా ఉచిత పంటల బీమా విషయంలో మన రాష్ట్రం దేశంలో పలు రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు.అయితే 2023-24 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఎన్నికల కోడ్ కారణంగా ప్రీమియం చెల్లింపులు నిలిచిపోయాయి. ఆతర్వాత వచ్చిన మీ ప్రభుత్వం వెంటనే స్పందించి చెల్లించాల్సి ఉన్నప్పటికీ దానిగురించి పట్టించుకోవడంలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికీ ప్రీమియం కట్టకపోవడంతో కేంద్రం కూడా తన వాటాను ఇప్పటికీ ఇవ్వలేదు. ఇప్పటికి జూన్, జులై మాసాలు గడిచిపోయాయి. ఆగస్టు నెలలో పక్షం రోజులు పూర్తికావొస్తున్నాయి. అయినా మీ ప్రభుత్వంలో ఎలాంటి కదలికలేకపోవడం అత్యంత విచారకరం. ఈ సంవత్సరం కోస్తాలో అతివృష్టి, రాయలసీమలో కరువు వల్ల పంటల దెబ్బతినే ప్రమాదం నెలకొంది. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీనతవల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారు. ఇప్పటికైనా మేలుకుని వెంటనే ఉచిత పంటల బీమా ప్రీమియం తక్షణమే చెల్లించి రైతులకు పంటల బీమా కింద చెల్లింపులు జరిగేలా చర్యలను చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాను అన్నారు.అలాగే రైతుకు పెట్టుబడి సాయం కింద రైతు భరోసా సొమ్ము ఏటా రూ.20వేలు ఇస్తామని సూపర్ సిక్స్ హామీల్లో పేర్కొన్నారు. మీరిచ్చే పెట్టుబడి సహాయం కోసం రైతులంతా ఎదురుచూస్తున్నారు. ఖరీఫ్ సీజన్ దాదాపు పూర్తికావొస్తున్నా ఇప్పటివరకూ దీనిపై ఎలాంటి ప్రకటనా లేదు.



మా ప్రభుత్వ హయాంలో కోవిడ్‌తో ప్రపంచ ఆర్థికవ్యవస్థలన్నీ కుదేలైనా క్రమం తప్పకుండా రైతులకు రైతు భరోసా అందించాం. ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా సీజన్లో రైతు భరోసా చెల్లించాం. 53.58 లక్షల మంది రైతులకు రూ.34,288 కోట్లు పెట్టుబడి సహాయం చేశాం. ఇప్పుడు మళ్లీ రైతులు పెట్టుబడులకోసం బ్యాంకులచుట్టూ, వడ్డీవ్యాపారులు చుట్టూ మళ్లీ తిరిగే పరిస్థితులను తీసుకొచ్చారు. వెంటనే పెట్టుబడి సహాయం కింద రైతులకు మీరు ఇస్తానన్న డబ్బులసహా, ఇన్సూరెన్స్ ప్రీమియంకట్టి ఆ 2023-24కు సంబంధించిన ఇన్సూరెన్స్ సొమ్మును తక్షణమే విడుదలచేయాలని డిమాండ్ చేశారు జగన్.

# గ్యారంటీలను అందిస్తాం.. పేదవారిని ఆదుకోవడమే మా లక్ష్యం: మంత్రి దామోదర

**తెలంగాణవీణ/హైదరాబాద్, ఆగస్టు 11:** గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాంగ్రెస్ పథకాలను నిర్వీర్యం చేసిందన్నారు మంత్రి దామోదర రాజనర్సింహ. కాంగ్రెస్‌కు కార్యకర్తలే బలమని ఆయన చెప్పుకొచ్చారు.ఇదే సమయంలో ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తామన్నారు.కాగా, మంత్రి దామెదర ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ కార్యకర్తల దయతోనే మాకు పదవులు వచ్చాయి. మా కోసం పనిచేసే వారికి నామినేటెడ్ పదవులు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం. ఆరు గ్యారంటీల్లో రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కింది. ఆగస్టు 15వ తేదీన రెండు లక్షల రుణమాఫీ చేస్తాం. సంక్షేమంతో పేదవాడిని ఆదుకోవాలన్నదే కాంగ్రెస్ లక్ష్యం.అందులో భాగంగానే ఆర్టీసీలో మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పించాం. ఆరోగ్యశ్రీ పథకాన్ని ఐదు లక్షల నుంచి పది లక్షల వరకు పెంచిన ఘనత కాంగ్రెస్ పార్టీదే.



ప్రతీఏటా ఆరోగ్యశ్రీ పథకం అమలు చేయడం ద్వారా రూ.580 కోట్లు ప్రభుత్వంపై భారం పడుతోంది. అయినా పేదల కోసం ?ప్రభుత్వం ఎంతైనా ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉంది. గత ప్రభుత్వం కాంగ్రెస్ పథకాలను నిర్వీర్యం చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రధానంగా విద్యా, వైద్యంపైనే ప్రత్యేక దృష్టి సారించింది. ప్రభుత్వ ఆసుపత్రిలో 134 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా పేదలకు అందజేస్తోంది.అవసరం ఉన్న చోట దయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేస్తాం. ప్రతీ 20 కిలోమీటర్లకు ఒక దయాలసిస్ సెంటర్ ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. జాతీయ రహదారిపై ప్రమాదాల్లో గాయపడిన వారిని రక్షించేందుకు ప్రతీ 35 కిలోమీటర్లకు ఒక ఎమర్జెన్సీ అంబులెన్స్ ఏర్పాటుతో పాటు 20 నిమిషాల్లో ఆసుపత్రికి తరలించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. జాతీయ రహదారిపై 35 కిలోమీటర్ల దూరంలోని ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చాయి. దేవరకద్రలో వంద పడకల ఆసుపత్రి మంజూరు అయ్యింది. కొత్తకోటలో 50 పడకల ఆసుపత్రికి మంజూరుకి అనుమతులు ఇస్తున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం పేదవాడికి పండుగను తీసుకువస్తుంది అంటూ కామెంట్స్ చేశారు.

## తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతీసేలా సీఎం మాట్లాడవద్దు: కేటీఆర్



**తెలంగాణవీణ/హైదరాబాద్,ఆగస్టు 11:** తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసేలా సీఎం మాట్లాడవద్దని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. భారాస హయాంలో రాష్ట్రంలో పెట్టుబడులకు అమరరాజాను ఒప్పించేందుకు కష్టపడ్డామని చెప్పారు.రూ.9500 కోట్ల పెట్టుబడులకు ఆ సంస్థ ముందు కొచ్చిందన్నారు. రాజకీయ విభేదాలతో తెలంగాణకు నష్టం జరగకూడదని చెప్పారు. కార్నింగ్ ప్లాంట్, అమరరాజా కంపెనీలు రాష్ట్రం నుంచి వెళ్లిపోతే తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. పెట్టుబడిదారులకు ఇచ్చిన హామీలు రాష్ట్ర ప్రభుత్వం గౌరవిస్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందనడం సీఎం మానేయాలని వ్యాఖ్యానించారు.

### యూట్యూబ్ మాజీ సీఈవో మృతికి సంతాపం

యూట్యూబ్ మాజీ సీఈవో సుశాన్ వొజ్కికి మరణవార్త చాలా బాధ కలిగించిందని కేటీఆర్ అన్నారు. అత్యంత డైనమిక్‌గా ఉండే వొజ్కికి ఎంతో తెలివైన వారని.. ఆమెతో పలు సందర్భాల్లో మాట్లాడటం ద్వారా చాలా నేర్చుకున్నానని తెలిపారు. వొజ్కికి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు కేటీఆర్ పేర్కొన్నారు. ఆమె కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## దాడుల కోసం.. అమిత్ షా సుపారీ తీసుకున్నారు: సంజయ్ రౌత్



**తెలంగాణవీణ/ముంబై,ఆగస్టు 11:** ఇతర పార్టీ చీఫ్‌ల కాన్వాయ్‌లే లక్ష్యంగా బీజేపీ, మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) పార్టీల కార్యకర్తలు దాడులు చేయటాన్ని ఇలాగే కొనసాగిస్తే.. తాము కూడా భవిష్యత్తులో ప్రతీకారం తీర్చుకుంటామని శివసేన(యూబీటీ) నేత సంజయ్ రౌత్ వార్నింగ్ ఇచ్చారు. తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. థానేలో శనివారం శివసేన(యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే కాన్వాపై ఎంఎన్ఎస్ కార్యాకర్తలు దాడి చేశారు. ఈ ఘటనపై ఆదివారం సంజయ్ రౌత్ మాట్లాడారు. అహ్మద్ షా అబ్దాలీ (హోంశాఖ మంత్రి అమిత్ షాను పరోక్షంగా ఉద్దేశిస్తూ..)కు మహారాష్ట్రంలో దాడుల ద్వారా అరాచకం వ్యాప్తి చేయాలని ఢిల్లీలో ఉండే కేంద్ర పాలకులు సుపారీ ఇచ్చారని మండిపడ్డారు.'ఉద్ధవ్ ఠాక్రే కాన్వాయ్‌పై శనివారం రాత్రి దాడి జరిగింది. ఇలాంటి చేయాలనే వాళ్లు ఉన్నారు. అమిత్ షా ఇలాంటి దాడులు చేయించడానికి ఢిల్లీ నుంచి సుపారీ అందుకున్నారు. ఎన్ఎన్ఎస్ కార్యకర్తలను ఇటువంటి పనులు చేయించుకోవడానికి ఉపయోగించుకుంటున్నారు. కానీ సదరు నేతలు మాత్రం ఢిల్లీ నుంచి సుపారీ తీసుకొని సైలెంట్‌గా ఉంటున్నారు. ఇలా దాడులకు తెగపడటం మహారాష్ట్రకు మంచిది కాదు. నేను ఏ పార్టీ పేరును ప్రస్తావించటం లేదు. కానీ, కొన్ని పార్టీలు మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలను తప్పుదోవ పట్టించడానికి ఇప్పటి నుంచే కుట్రలు పన్నుతున్నారు' అని మండిపడ్డారు.

## సాగర్‌కు పోటెత్తిన పర్యాటకులు.. భారీగా ట్రాఫిక్ జామ్




**తెలంగాణవీణ/నల్గొండ జిల్లా,ఆగస్టు 11:** నాగార్జున సాగర్‌కు పర్యాటకుల తాకిడి పెరగడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఆదివారం సెలవు దినం కావడంతో తెలుగు రాష్ట్రాల నుంచి ప్రాజెక్ట్ అందాలను చూసేందుకు పర్యాటకులు భారీగా తరలివచ్చారు.దీంతో సాగర్ పరిసర ప్రాంతాదలు కిటకిటలాడాయి. ట్రాఫిక్ జామ్ కారణంగా అంబులెన్స్ ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకోవడంతో రోగి, బంధువులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.నాగార్జునసాగర్ జలాశయం నిండుకుండలా మారింది. వారం రోజులుగా ప్రాజెక్టు క్రస్ట్‌గేట్ల నుంచి దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది. మరోవైపు, నాగార్జునసాగర్ ప్రాజెక్టు డ్యామ్ వద్ద సీఆర్పీఎఫ్ సిబ్బంది అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. రాజకీయ నాయకుల సిఫార్సు ఉన్నవారిని మాత్రమే డ్యామ్ పైకి పంపుతున్నారని పర్యాటకులు ఆరోపిస్తున్నారు.

## తెలంగాణలో రేషన్ లబ్ధిదారులకు గుడ్ న్యూస్..



**తెలంగాణవీణ/హైదరాబాద్, ఆగస్టు 11:** రేషన్ లబ్ధిదారులకు గుడ్ న్యూస్.. వచ్చే ఏడాది నుంచి రేషన్ లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేయాలని తెలంగాణ క్యాబినెట్ సబ్‌కమిటీ నిర్ణయించింది. చౌకధర దుకాణాలు, మధ్యాహ్న భోజన పథకం ద్వారా ఏటా 24లక్షల టన్నుల దొడ్డు బియ్యం పంపిణీ జరుగుతోందన్న సబ్ కమిటీ.. దీనిలో సగానికి పైగా దారి మళ్లుతున్నట్లు గుర్తించింది.రేషన్ కార్డులతో పాటు ఆరోగ్యశ్రీ కార్డులను స్మార్ట్ కార్డుల రూపంలో ఇవ్వాలని నిర్ణయించింది. కుటుంబ సమగ్ర ఆరోగ్య వివరాలతో వీటిని జారీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. గత 10 ఏళ్లలో కొత్త రేషన్ కార్డులు ఇవ్వకపోవడంతో.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. దీనిపై ఇప్పటికే స్పందించిన ప్రభుత్వం.. కొత్త రేషన్ కార్డులను త్వరలోనే ఇస్తామని వెల్లడించింది.

తెలంగాణ వీణ
తెలంగాణ వీణ ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
8328209811



## కాంగ్రెస్ నేత కనకయ్య ఆశయాలను కొనసాగిస్తాం

**తెలంగాణవీణ/తిరుమలాయపాలెం,ఆగస్టు 11:** తాను నమ్మిన సిద్ధాంతం కోసం ప్రజలతో మమేకమై నిరంతరం ప్రజా శ్రేయస్ కోసం అంకితమై పనిచేసిన కీర్తిశేషులు మాజీ జెడ్పిటిసి లంజపల్లి కనకయ్య ఆశయాలను కొనసాగిస్తామని పలువురు వక్తలు పేర్కొన్నారు.మండల పరిధిలోని జూపెడ గ్రామానికి చెందిన కీర్తిశేషులు మాజీ జెడ్పిటిసి లంజపల్లి కనకయ్య రెండవ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన కుమారులు ఎల్.శ్రీనివాస్, శ్రీకాంత్ లు మాట్లాడుతూ...మా నాన్నగారు చిన్నతనం నుండి కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు కృషి చేశారని చెప్పారు.మా అమ్మ స్వర్గీయ అంజమ్మ మాజీ ఎంపీటీసీ గా పని చేశారని మా నాన్న కనకయ్య తిరుమలాయపాలెం మండలంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కొరకు శక్తిమంచని లేకుండా కృషి చేశారని ఆయన బాటలో మేము కూడా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కొరకు పనిచేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి ఎల్.రజిత శ్రీనివాస్, నాగార్జున వనవాసం,నరేందర్ రెడ్డి,మట్టే వీరబాబు, జంపాల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## అందర్నీ చల్లంగా చూడు తల్లి

**- టీవైజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ తనుగుల జితేందర్ రావు**





**తెలంగాణవీణ/మల్కాజిగిరి,ఆగస్టు11:**రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తూ అందరినీ చల్లంగా చూడాలని యాప్రాల్ పెద్దమ్మ తల్లిని టీవైజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ తనుగుల జితేందర్ రావు వేడుకున్నారు.ఆదివారం మల్కాజిగిరి జిల్లా యాప్రాల్ పెద్దమ్మ తల్లి దేవస్థానం ముదిరాజ్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన బోనాల ఉత్సవాల ఆహ్వానం మేరకు ఆయన హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా జితేందర్ రావును ఆ దేవస్థాన ముదిరాజ్ కమిటీ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో శ్రీ పెద్దమ్మ తల్లి ముదిరాజ్ కమిటీ అధ్యక్షులు కావలి చంద్రశేఖర్ ముదిరాజ్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ ముదిరాజ్,చంద్రయ్య ముదిరాజ్,ప్రధాన కార్యదర్శి నరేష్ ముదిరాజ్, కోశాధికారి సాయిబాబా ముదిరాజ్,కార్యదర్శి కొండయ్య ముదిరాజ్,సహాయ కార్యదర్శులు గోపాల్ ముదిరాజ్, ఆనంద్ ముదిరాజ్,బాబు ముదిరాజ్, సంఘ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## చెక్ డ్యామ్‌లో నీట మునిగి వ్యక్తి మృతి

**తెలంగాణవీణ/పాపన్నపేట,ఆగస్టు11 :** ఏడుపాయల చెక్ డ్యాంలో ఆదివారం స్నానం చేయడానికి వెళ్లి ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి నీట మునిగి మృతి చెందాడు.ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం వివరాలు సంగారెడ్డి జిల్లా బుదేరా కు చెందిన చాకలి గోపాల్(44) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు.అతని నాయనమ్మ చనిపోవడంతో నిద్ర చేయడం కోసం శనివారం ఏడుపాయలకు వచ్చారు.ఆదివారం ఉదయం స్నానం చేసేందుకు గోపాల్ చెక్ డ్యాం వద్దకు వెళ్లాడు.స్నానం చేస్తూ ప్రమాదవశాత్తు నీట మునిగి పోయాడు.కుటుంబీకులు గమనించి స్థానికుల సాయంతో చెక్ డ్యామ్ లో గాలించారు.పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని చెక్ డ్యామ్ లో గాలించి మృతదేహాన్ని వెలికి తీశారు.పోస్టుమార్టం నిమిత్తం మెదక్ జిల్లా ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు కొడుకు వివేకానంద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

# సర్వైకల్ క్యాన్సర్ వ్యాధి పట్ల పెద్ద ఎత్తున సమాజంలోనికి తీసుకువెళ్ళాలి

**- అబ్ట్రిక్ అండ్ గైనిక్ హెచ్ఓడి డాక్టర్ ఛాయా దేవి**















**తెలంగాణవీణ/కూకట్ పల్లి:** సర్వైకల్ క్యాన్సర్ వ్యాధి పట్ల పెద్ద ఎత్తున సమాజం లోనికి తీసుకు వెళ్ళాలని రామ్దేవ్ రావు ఆసుపత్రి అబ్ట్రిక్ అండ్ గైనిక్ హెచ్ఓడి డాక్టర్ ఛాయా దేవి అన్నారు. సర్వైకల్ క్యాన్సర్ పట్ల రాందేవ్ రావ్ హాస్పిటల్ గత సం కాలం నుండి 2500 మంది వరకు వాక్సినేషన్ చేయటం జరిగింది. దీనిలో 1500 మంది 9 నుంచి 14 సం ఉన్న పిల్లలకు ఫ్రీ వాక్సినేషన్ ఇవ్వటం జరిగింది. సమాజానికి సేవ చేయటం లో , సమాజానికి ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించటం లో రాందేవ్ రావ్ హాస్పిటల్ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రథమ సంవత్సరం అయిన సందర్భంగా ఆదివారం రాందేవ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో అవగాహన రన్ , వాక్ ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాందేవ్ రావ్ హాస్పిటల్ కన్సల్టెంట్ డాక్టర్స్ ( స్పెషలిస్ట్, సూపర్ స్పెషలిస్ట్ ), డ్యూటీ డాక్టర్స్, అడ్మిన్ మేనేజర్లు, ఇతర పారామెడికల్ సిబ్బంది పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఛాయా దేవి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సిన్ తీసుకొని ఈ వ్యాధిని జీవిత కాలమంతా నివారించాలన్నారు. సర్వైకల్ క్యాన్సర్ వ్యాధి పట్ల పెద్ద ఎత్తున సమాజం లోనికి తీసుకు వెళ్ళటానికి ప్రయత్నాలు చేస్తున్న రాందేవ్ రావ్ హాస్పిటల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.. జనరల్ , లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ శ్రీనివాసులు పచమట్ల మాట్లాడుతూ హాస్పిటల్ లో పని చేస్తున్న ప్రతి ఒక్క సిబ్బంది ఆరోగ్యం గా ఉండటం వలన సమాజానికి మంచి ఆరోగ్యాన్ని అందించగలుగుతామని ఆయన పేర్కొన్నారు.అందువలన హాస్పిటల్ లోని గ్రేడ్ 4 సిబ్బంది మొదలుకొని నర్సెస్, పారామెడికల్ సిబ్బంది,డ్యూటీ డాక్టర్స్, కన్సల్టెంట్ డాక్టర్స్ అందరూ తమ ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండాలి అని, దీని కొరకు రోజు ప్రతిఒక్కరూ 30 నిమిషాలు వ్యాయామం చేయాలి అని సూచించారు. హాస్పటల్ మెడికల్ డైరెక్టర్ %ణతీ%. కమలాకర్ గారు మాట్లాడుతూ ఈ వాక్సినేషన్ కార్యక్రమాన్ని సమాజం లో మరింత ముందుకు తీసుకువెళ్ళాలి అని సూచించారు. ప్రతిఒక్కరూ వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ కలిగి ఉండాలి అని, రోజుకు 30 నుంచి 60 నిమిషాలు వ్యాయామం చేయాలి అని సూచించారు.ప్రతి ఒక్కరూ ఆరోగ్యం గా ఉండటం వలన ఆరోగ్యవంతమైన సమాజాన్ని రేపటి తరాలకోసం నిర్మించగలుగుతామని ఆయన పేర్కొన్నారు. ఈ ఫ్రీ వాక్సినేషన్ కార్యక్రమానికి సహకరిస్తున్న విక్రమ్ దేవ్ కి , మీరా రావ్ కి , అపర్ణ రావ్ కి, ప్రశాంత్ రెడ్డి కి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. హాస్పటల్ సీఈఓ డాక్టర్ యోబు మాట్లాడుతూ ఈ కార్యక్రమం లో పాల్గొని విజయంతం చేసిన ప్రతి ఒక్కరికీ పేరు పేరున కృతజ్ఞతలు తెలిపారు.ఈ 5 కె రన్ , వాక్ లో కన్సల్టెంట్ లు డాక్టర్ లోకేష్ రెడ్డి, డాక్టర్ ఆదిత్య , డాక్టర్. ప్రమోదినీ, డాక్టర్ పావని,డాక్టర్ .మంజుల ( ఆప్తమోలజీ), డాక్టర్ మంజుల ( ఆబ్స్ట్రిక్),డాక్టర్ సుధా రాణి ( అనస్థీషియా), డాక్టర్ సుప్రియ, డ్యూటీ డాక్టర్స్ డాక్టర్ లావణ్య ,డాక్టర్ శృతి, డాక్టర్ ప్రిన్సీ,డాక్టర్ శృతి ,డాక్టర్ అక్షిత,డాక్టర్ అనురాధ, అడ్మిన్ మేనేజర్లు రమాదేవి, ప్రదీప్, క్రాంతి కుమార్, రణ దీప్, సురేష్ రాజు , భారతి, నాగేంద్ర , నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ అర్చనా , వైస్ ప్రిన్సిపాల్ సెలీనా , విద్యార్థులు, గ్రేడ్ 4 సిబ్బంది పాల్గొన్నారు.

# జర్నలిస్టులు సమస్యలను ధీటుగా ఎదుర్కోవాలి చావు పరిష్కారం కాదు

**- ఆర్థిక ఇబ్బందుల్లో జర్నలిస్టులు - యువ జర్నలిస్టు ఆత్మహత్య శోచనీయం - ప్రభుత్వం యోగి కుటుంబాన్ని ఆదుకోవాలి - ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎండి రియాజ్,ప్రధాన కార్యదర్శి ఆర్. వీరాంజీ**



**తెలంగాణవీణ/మరిపెడ,ఆగస్టు11:** సమాజం శ్రేయస్సులో జర్నలిస్టు పాత్ర అత్యంత కీలకమని, ప్రభుత్వానికి ప్రజలకు వారధులుగా పని చేసే జర్నలిస్టులు నేడు ఆర్థికంగా, మానసికంగా నలిగిపోతున్నారు.మరిపెడ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మొహమ్మద్ రియాజ్ పాషా,ప్రధాన కార్యదర్శి రాంపెల్లి వీరాంజీ, అన్నారు.ఆర్థిక ఇబ్బందులతో కుమార్తె తో సహా ఆత్మహత్య చేసుకున్న వరంగల్ కు చెందిన జర్నలిస్టు యోగి,ఆయన కుమార్తె చిత్ర పటానికి మరిపెడ మండల ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం మరిపెడ మండల కేంద్రలోని కార్గిల్ స్తూపం వద్ద కొవ్వొత్తుల నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రియాజ్ పాషా మాట్లాడుతూ...సమాజ హితం కోసం పోరాడే జర్నలిస్టులు సమస్యలను ధీటుగా ఎదుర్కోవాలని యువ జర్నలిస్టు నేడు ఆత్మహత్య చేసుకోవడం శోచనీయమన్నారు.ప్రభుత్వం యోగి కుటుంబానికి అండగా నిలవాలని,వారి కుటుంబాన్ని ఆదుకో వాలని అన్నారు.నేడు సమాజంలో జర్నలిస్టులు ఆర్థికంగా, మానసి కంగా నలిగిపోతున్నారని,యాజమాన్యాల టార్గెట్లు,ఫీల్డ్ మీద ఇబ్బందులు ఇలా అన్ని విధాలా నేడు జర్నలిస్టులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వాలు జర్నలిస్టుల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని నిరుపేద జర్నలిస్టులకు ఇల్లు,హెల్త్,బస్ పాస్,రైల్వే పాస్,ప్రయివేటు పాఠశాలలు కళాశాలల్లో రాష్టంలోని ఏ ప్రాంతంలో అయిన రాయితీ కల్పించాలని కోరారు.ప్రజల సమస్యలు ప్రభుత్వానికి నివేదిస్తూ,ప్రభుత్వ పాలన దక్షితను ప్రజల్లోకి తీసుకెళ్తూ వారధులుగా పని చేస్తూ కుటుంబాలకు దూరంగా ఉంటున్న జర్నలిస్టుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమనికి కాంగ్రెస్ మరిపెడ పట్టణ అధ్యక్షుడు షేక్ తాజోద్దీన్,సిపిఎం మండల కార్యదర్శి దుండీ వీరన్న,నాయకుడు గుండగాని మధుసూదన్,పట్టణ వాసులు అలువల శ్రీధర్,రహీం,స్థానికులు సంఘీభావం తెలిపారు.ఈ కార్యక్రమంలో గౌరవ సలహా దారులు శ్రీరంగం శ్రీనివాస్,గాడిపెల్లి శ్రీశైలం,పసునూటి వేణు,కోశాధికారి మచ్చ రాజేష్,ఆర్గనైజింగ్ కార్యదర్శి జిన్నా లచ్చన్న, సహాయ కార్యదర్శి పోతుల గోవర్ధన్,మహేందర్, సభ్యులు వంకాయల పాటి తిరుమలరావు,రాజేష్, ఉమేష్,సాయి,సంజీవలు పాల్గొన్నారు.

# జర్నలిస్టు యోగి కుటుంబాన్ని ప్రభుత్వాన్ని ఆదుకోవాలి

**- యోగి మరణంతో దిగ్భ్రాంతికి లోనై కలం కార్మికులు**

**- ప్రజా సంఘాల నాయకులు జర్నలిస్టు నేతలు ఘన నివాళులు**



**తెలంగాణవీణ/నెల్లికుదురు,ఆగస్టు11:**జర్నలిస్టు యోగి రెడ్డి కుటుంబాన్ని ప్రభుత్వ ఆదుకోవాలని ప్రజా సంఘాల నాయకులు జర్నలిస్టు నేతలు ప్రభుత్వము ను డిమాండ్ చేశారు.ఆదివారం స్థానిక మండల కేంద్రములో మండల జర్నలిస్టు ల ఆద్వర్యంలో జర్నలిస్టు యోగి రెడ్డి కూతురు అద్యా లాకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాసంఘాల నాయకులు రాజకీయ నాయకులు జర్నలిస్టులు మాట్లాడుతూ... ఆత్మహత్య చేసుకున్న తొలి వెలుగు జర్నలిస్టు యోగి దారుణానికి ఒడిగట్టడం చాలా బాధాకరమని ఇలాంటి సంఘటనలు పునరవృతం కాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తు జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వాలు పరిష్కరించడంలో నిర్లక్ష్య ధోరణి విడనాడాలని అన్నారు.ప్రభుత్వాలు తమ పబ్బం గడుపుకోవడం కోసమే హామీలు ఇస్తున్నారని వాటిని అమలు చేయడం లో విస్మరించడం జరుగుతుందన్నారు.నేటి కొత్త ప్రభుత్వ లోనైన సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ కిసాన్ కాంగ్రెసు రాష్ట్ర కో–ఆర్డినేటర్ పెరుమాండ గుట్టయ్య గౌడ్,మాజీ జడ్పీటిసి హెచ్ వెంకటేశ్వర్లు,మండల జర్నలిస్టులు బొడ్డు అశోక్,మస్కపురి కుమార స్వామి,మద్ది వేంకటేశ్వర్లు,మస్కపురి సుధాకర్,నగేష్,జగన్,జిలకర శ్రీనాథ్,మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మరికుంట్ల మౌనేందర్,జిలకర యాలద్రి,వెన్నాం క్రాంతి రెడ్డి,చదల హెల్యా,పయ్యావుల భిక్షం తదితరులు పాల్గొన్నారు.

# మొగుళ్ళపల్లి మండల ప్రజలకు 108 వాహన సేవలను అందించాలి

**- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి**

**తెలంగాణవీణ/మొగుళ్లపల్లి, ఆగష్టు 11:** మొగుళ్ళపల్లి మండలానికి 108 వాహన సేవలను అందించి ఆపద సమయంలో ఉన్న ప్రజలను ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి కోరారు. ఆదివారం అయన విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మారుమూల ప్రాంతమైన మొగుల్లపల్లి మండలానికి 108 వాహనం లేకపోవడంతో రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు, ప్రజలు అనారోగ్యం బారిన పడినప్పుడు, ఆపద సమయంలో ఉన్న ప్రజలు



తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. చిట్యాల మండల కేంద్రం నుండి 108 వాహనం వచ్చే వరకు సమయం సరిపోక..అత్యవసర పరిస్థితులలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ ప్రజలు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుందన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే పెద్ద మండలంగా పెరొందిన మొగుళ్ళపల్లి మండలానికి 108 వాహనాన్ని కేటాయించకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. వెంటనే స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ స్పందించి 108 వాహనాన్ని కేటాయించాలని ఆకుతోట కుమారస్వామి ప్రజల తరపున వారికి విజ్ఞప్తి చేశారు.

# కులగణననైనా చేపట్టండి..లేకుంటే కుర్చీలైన దిగండి

**- బీసీలను విస్మరించిన బిజెపి - బీసీ సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్**

**తెలంగాణవీణ/మొగుళ్లపల్లి, ఆగష్టు 11:** ఇటు తెలంగాణలో, అటు దేశంలో సమగ్ర కులగణన చేపట్టి..బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను పెంచాలని, రిజర్వేషన్లను పెంచకుండా బీసీలను విస్మరిస్తే తగిన బుద్ధి చెప్తామని బీసీ సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్ హెచ్చరించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కులాల లెక్కలు తేల్చాలని బీసీ సమాజమంతా కోరుకుంటుంటే..ఇవేమీ పట్టనట్లు ప్రభుత్వాలు, పాలకులు ఆలోచించడం ఏమిటని ఆయన మండిపడ్డారు. బీసీ కులాల లెక్కలన్నా తీయాలి..లేదా కుర్చీలన్నా ఖాళీ చేయండని మహేందర్ గౌడ్ అన్నారు. దేశవ్యాప్తంగా చేపట్టే జన గణనలో కులగణన చేపట్టాలని, బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను పెంచి, మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలని, సామాజిక రిజర్వేషన్ల పరిమితిని పెంచాలన్నారు. బిజెపి ప్రభుత్వం గత 10 సంవత్సరాలుగా ఓబీసీలను విస్మరించినందుకే 400 సీట్లతో సంపూర్ణ మెజార్టీతో అధికారంలోకి వస్తామని చిలుక పలుకులు పలికిన బిజెపి 240తో సరిపెట్టుకోవాల్సి వచ్చిందన్నారు. బీసీల కనీస డిమాండ్లు నెరవేర్చనందుకు, బీసీలపై అడుగడుగునా వివక్షత, అణచివేత ధోరణి చూపినందుకే సంపూర్ణ మెజార్టీతో ఉండాల్సిన బీజేపీ ప్రభుత్వం ఈరోజు సంకీర్ణంలోకి పడిపోయిందన్నారు. కులగణన ఎజెండాతో ఎన్నికలలోకి వెళ్లిన ఇండియా కూటమికి సర్వేలకు విరుద్ధంగా అనహ్య మద్దతు వచ్చిందంటే కులగణన చేస్తామని చెప్పినందుకే దేశవ్యాప్తంగా ఉన్న ఓబీసీలు ఇండియా కూటమికి అండగా నిలిచారన్నారు. ఇప్పటికైనా ప్రధాని నరేంద్ర మోడీ బీసీలపై దృష్టి సారించాలని, ఎస్సీ వర్గీకరణ లాగే బీసీలకు కులగణన, కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ, చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు, మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలని కోరారు. బీసీల సమస్త డిమాండ్లను నెరవేర్చి ప్రధాని నరేంద్ర మోడీ బీసీ బిడ్డగా..బీసీల ఆకాంక్షలను నెరవేర్చాలన్నారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన బీసీ డిక్లరేషన్ ను అమలు




చేసి..కులగనణను చేపట్టి..42 శాతం రిజర్వేషన్లను ప్రవేశపెట్టిన తర్వాతనే స్థానిక ఎన్నికలను నిర్వహించాలని ఆయన కోరారు.

# పేద కుటుంబాలు సంతోషంగా ఉండాలంటే శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో చేరండి

**- పేదరికం ఉండదు కుటుంబాలు బాగుపడతాయి: మంత్రి సీతక్క**

**తెలంగాణవీణ/ములుగు ప్రతినిధి:** ములుగు జిల్లా కేంద్రంలో ఆదివారం క్యాంప్ ఆఫీస్ లో మంత్రి సీతక్క చేతుల మీదుగా శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ బీమా చెక్కును అందించడం జరిగింది మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కూడా జీవిత బీమాను కలిగి ఉండాలని శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ నందు 23,880, బీమా పాలసీ తీసుకొని ప్రమాదవశాత్తు మరణించడం జరిగింది. వారి నామిని అయినటువంటి రజిత కి 8,67,765 రూపాయలు అందించడం జరిగింది., అలాగే ప్రతి నెల 3,450 పెన్షన్ మార్చి 2038 వరకు ఇవ్వడం జరుగుతుంది. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థను అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కరీంనగర్, వరంగల్ ఏజీఎం అట్లా సురేష్ , వరంగల్ డివిజన్ మేనేజర్ బండి వినయ్ , ములుగు మేనేజర్ ప్రశాంత్ , భూపాల్ పల్లి




మేనేజర్ సంతోష్ , డివో జరుపుల రాజు అన్నం నారాయణ. ఎగ్జిక్యూటివ్ భూక్య సురేష్. మంజుల మేడం . సేల్స్ ఆఫీసర్స్, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# నేడు ప్రజావాణి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**- జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్.**



**తెలంగాణవీణ/ములుగు ప్రతినిధి, :** ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరం లో నిర్వహించనున్నామని జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్. ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం కొనసాగుతు ందని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఈ కార్యక్రమా న్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.ఈ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా అధికారులు, 9 మండలాల తహసీల్దార్లు, ఎంపిడిఓలు, ఎం.పి. ఓ.లు తప్పకుండా హాజరు కావాల్సిందిగా ఆయన ఆదేశించారు.

# పసికందు ఘటన కలచివేసింది: కొండ సురేఖ



**తెలంగాణవీణ/వరంగల్ ప్రతినిధి, ఆగష్టు 11:** వరంగల్ మహాత్మా గాంధీ ఆసుపత్రి ఆవరణలో పసికందుపై వీధి కుక్కల దాడి ఘటన తీవ్రంగా కలచి వేసిందని రాష్ట్ర దేవదాయ అటవీ పర్యావరణ శాఖ మాత్యులు శ్రీమతి కొండ సురేఖ నేడొక ప్రకటనలో తెలిపారు. ఎం జి ఎం ఆసుపత్రి ప్రాంగణంలో ఈ ఘటన జరగడం బాధాకరమని పసికందు ను ఎక్కడి నుండి కుక్కలు తీసుకోవచ్చాయో విచారించాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు అప్రమత్తంగా ఉంటూ ఇలాంటి సంఘటనలు జరగకుండా నిత్యం పర్యవేక్షించాలన్నారు. ఎంజీఎం ఆసుపత్రిలో ఉపస్థితిలో ఉన్న సీసీ కెమెరాలకు అదనంగా ఆసుపత్రి చుట్టూ ప్రక్కల సిసి కెమెరాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులు, బహిరంగ ప్రదేశాలలో వీధి కుక్కలు సంచరించకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ యంత్రాంగాన్ని ఈ సందర్భంగా మంత్రి ఆదేశించారు.

## దేవమ్మ బస్తీలో అమ్మవారి ఆలయం వద్ద అన్నదానం



**తెలంగాణవీణ/కుత్బుల్లాపూర్:** గాజులరామారం సర్కిల్ జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని దేవమ్మ బస్తీలో బోనాల పండుగను పురస్కరించుకుని భక్తులు అమ్మవారికి సమర్పించిన ఓడి బియ్యంతో ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బి.ఆర్.ఎస్ యూత్ నాయకులు కొలుకుల జైహింద్ హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, మహేందర్ గౌడ్, రాములు, కిట్టు, సత్యరాజు, మైలారం రాజు, శ్రీకాంత్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారిని ఆశీర్వదించిన ఎమ్మెల్యే




**తెలంగాణవీణ/మొగుల్లపల్లి:** మండలంలోని ఇస్సిపేట గ్రామానికి చెందిన అనుముల రాజు -శ్రీలేఖ దంపతుల కుమార్తె మోక్షిత మొదటి పుట్టినరోజు వేడుకలు అమ్మ గార్డెన్లో ఆదివారం ఘనంగా జరగగా .ఈ కార్యక్రమానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో చిట్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ రఫీ, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నీల రాజు,కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు తక్కలపల్లి రాజు,మధుకర్ రెడ్డి,ధనుంజయ్,రాజు,చంటి, ఎండి హుస్సేన్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టిఐ గ్రామ కన్వీనర్‌గా ఇలవేణి గట్టయ్య



**తెలంగాణవీణ/మొగుళ్లపల్లి, :** మండలం లోని ఆకినపల్లి గ్రామానికి చెందిన ,ఇలవేణి గట్టయ్య యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్టీఐ గ్రామ కన్వీనర్ గా నియమించినట్లు, యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్టిఐ మండల కన్వీనర్ కమలాపురం విజేందర్ ఆదివారం ఒక ప్రకటన లో తెలిపారు. ఈ సందర్భంగా గట్టయ్య మాట్లాడుతూ.. అవినీతి అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు సమాచార హక్కు చట్టం ఆయుధంగా పనిచేస్తుందని సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో వజ్రాయుధంగా పనిచేస్తుందని అవినీతి అధికారులను ప్రశ్నించే గొంతుకనై పని చేస్తానని గట్టయ్య అన్నారు. నన్ను ఎన్నిక చేసినందుకు మండల కన్వీనర్ విజేందర్ కు జిల్లా కమిటీకి ప్రత్యేకంగా వారు కృతజ్ఞతలు తెలిపారు.

## కొడారి రమేష్ యాదవ్‌కు జర్నలిస్టుల ఆత్మీయ పరామర్శ

**తెలంగాణవీణ/మొగుళ్లపల్లి,ఆగష్టు 11:** చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొడారి రమేష్ యాదవ్ ను జర్నలిస్టులు ఆదివారం ఆత్మీయంగా పరామర్శించారు. ఆయన తండ్రి ఇస్సిపేట గ్రామ మాజీ సర్పంచ్ కొడారి కొంరయ్య యాదవ్ శుక్రవారం రోజున మృతి చెందారు. కాగా టిడబ్ల్యూజేఎఫ్ జర్నలిస్టుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల మహేందర్ గౌడ్, ప్రెస్ క్లబ్ మొగుళ్లపల్లి మండల అధ్యక్షుడు దుర్గం సురేష్ గౌడ్, టిడబ్ల్యూజేఎఫ్ మండల అధ్యక్షుడు నిమ్మల భద్రయ్య, ప్రెస్ క్లబ్ మండల ప్రధాన కార్యదర్శి మంగళపల్లి శ్రీనివాస్, టిడబ్ల్యూజేఎఫ్ మండల ఉపాధ్యక్షుడు వేముల కిరణ్ గౌడ్, టిడబ్ల్యూజేఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి మురహరి మనోజ్ లు ఆదివారం రోజున కొడారి రమేష్ యాదవ్ ను ఆత్మీయంగా పరామర్శించారు.



# మల్కాజిగిరి సర్కిల్‌లో

# అక్రమ నిర్మాణాల జోరు....

- బఫర్ జోన్‌లో వెలుస్తున్న నిర్మాణాలు...
- నిబంధనలు నిల్...నిర్మాణాలు ఫుల్ ...
- బారీ షెడ్లు... సెల్లార్ తవ్వకాలు ...
- ఆగని అదనపు అంతస్తుల నిర్మాణాలు..
- పట్టించుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు











**తెలంగాణవీణ/మల్కాజిగిరి :** మల్కాజిగిరి సర్కిల్ అక్రమ నిర్మాణాలకు అడ్డాగా మారింది. మల్కాజిగిరి, మౌలాలీ, గౌతంనగర్, ఈస్టుఆనంద్ బాగ్, వినాయక్ నగర్, నేరేడ్ మెట్ డివిజన్ల పరిధిలోని పలు కాలనీలో నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవటం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. బండచెరువు బఫర్ జోన్ లో విచ్చల విడిగా నిర్మాణాలు కొనసాగుతున్నాయి. సెల్లార్ నిర్మాణాలతో పాటు ఆదనపు అంతస్తుల నిర్మాణాలు విచ్చల విడిగా కొనసాగు తున్నాయి. ఇందుకు స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలు మెండుగా ఉండటంతో అక్రమి నిర్మాణాలకు అడ్డుఅదుపులేకుండా పోతుందని కాలనీవాసులు వాపోతున్నారు. సర్కిల్ పరిధిలోని ఆరు డివిజన్ లలో ఇష్టరాజ్యంగా అక్రమ కట్టడాలు వెలుస్తున్నా, టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవటం లేదనీ నోటీసులు జారీ చేశామంటూ చేతులు దులుపుకుంటున్నారు. అక్రమంగా రోడ్లు ఆక్రమించి కట్ట డాలు చేపడుతున్నా, సెల్లార్లు, బహు ళ అంతస్తులు, పెంట్ హౌస్‌ల నిర్మాణాలు లెక్కకులేనన్ని జరుగు తున్నాయి. వినాయక్ నగర్ డివిజన్‌పరిధిలోని సింహాద్రి నగర్, కాకతీయ నగర్, సఫిల్ గూడ ప్రధాన రహదారి లో అక్రమంగా సెల్లార్ నిర్మాణం జరుగు తున్న, బహుళ అంతస్తులు నిర్మాణం యదేచ్చగా జరుగుతున్నా పట్టించునే నాథుడే కరువైయ్యారు. ఎవరెవరికి చెందాల్సిన ముడుపులు వారికి చెందుతుంటే అక్రమ నిర్మాణాల గురించి అధికారులు ఎందుకు పట్టించుకుంటారంటూ స్థానికులు ప్రశిస్తున్నారు. ఇప్పటికైనా జిహెచ్ఎంసి ఉన్నతాధికారులు మల్కాజిగిరి సర్కిల్ లో వెలుస్తున్న అక్రమ కట్టడాల నియంత్రనకు తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు భావిస్తున్నారు.

---

# జన ఔషధీ కేంద్రాలను

# ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి

**- ప్రధానమంత్రి మోడీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి: మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్**







**తెలంగాణ వీణ/మల్కాజ్గిరి:** ప్రధాని నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ తెలిపారు. ఆదివారం నేరేడ్మెట్ డివిజన్ పరిధిలోని సైనిక్ విహార్ లో మాజీ సైనికులు, బిజెపి సీనియర్ నాయకులు గోపు రమణారెడ్డి ఆధ్వర్యంలో నేరేడ్మెట్ డివిజన్ సైనిక్ విహార కాలనీలో ప్రధానమంత్రి భారతీయ జన ఔషధీ కేంద్రాన్ని మల్కాజ్గిరి పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్ కేంద్రాన్ని ప్రారంభించి అనంతరం పీఎం జన ఔషధీ పరియోజన గురించి మాట్లాడుతూ దేశంలో 12,400 పైగా కేంద్రాలు ఉన్నయి. ఈ కేంద్రాలలో దాదాపు 50 నుండి 90 శాతం మార్కెట్ ధరలు కన్నా నాణ్యత కలిగిన మందులు ,బ్రాండెడ్ తో సమానమైన క్వాలిటీ కలిగి అన్ని పరీక్షలు జరిగిన తర్వాత ఈ కేంద్రాలకు కేంద్ర ప్రభుత్వం ద్వారా మందులు సరఫరా చేయబడుచున్నాయి. భారతదేశంలో ప్రతి మనిషి డబ్బు లేక ఆరోగ్యం క్షీణించి ప్రాణాలు కోల్పోకూడదని ఉద్దేశ్యంతో మన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోది ప్రవేశపెట్టిన అనేక పథకాలలో ఒక బ్రహ్మాండమైన పథకం పీఎం బిజెపి ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి పరియోజన ఈ పథకం ఈ ద్వారా బీద బడుగు బలహీన వర్గాల వారికి ఒక బ్రహ్మాండమైన వరం లాంటిది. ఈ స్కీం కింద పీఎం జాన్ ఔషధ కేంద్రాలు పనిచేస్తున్నాయని ఈ కేంద్రాలలో బీపీ షుగర్ క్యాన్సర్ లివర్ ఇతర అనేక రకాలైన జబ్బులకు మార్కెట్ ధరల కన్నా దాదాపు 50 నుండి 90 శాతం తక్కువ ధరలకే మందులు అందిస్తున్నామని ఎంపీ రాజేందర్ అన్నారు.భారతీయ జనతా పార్టీ రాష్ట్ర మాజీ సైనికుల విభాగం కన్వీనర్ గోపురమన రెడ్డి మాట్లాడుతూ 27వ జన ఔషధీ కేంద్రం మధుర నగర్ కాలనీలో ఏర్పాటు చేయడం ఎంతో సంతోషం గా ఉందని ప్రజలకు మరింత సేవ చేయాలని తపన ఉందని నేను ఒక మాజీ సైనికుడునని సమాజానికి పనిచేయాలని మంచి హృదయంతో పని చేస్తున్నానని వారు తెలియజేశారు. మహిళలు వాడుకునే సానిటరీ పాడ్స్ ఒక్క రూపాయికి ఒకటి అందుబాటులో పీఎం జన్ ఔషది కేంద్రాలలో ఉన్నాయని ప్రతి ఒక్క మహిళ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆరోగ్యంగా ఉండాలని వారు కొనియాడారు. పియం జన ఔషధీ కేంద్రాలలో అవసరమైన మందులు కొనుక్కొని డబ్బులు ఆదా చేసుకోవాలని పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ తెలిపారు.మధుర నగర్ కాలనీలో గోపురమన రెడ్డి ఏర్పాటు చేసినందుకు వారిని ఎంపీ అభినందించడం ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎన్ రామచంద్ర రావు , మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ , వినాయక నగర్ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి మాజీ మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు గీత మూర్తి ,, నేరేడ్మెట్ డివిజన్ అధ్యక్షులు సత్యనారాయణ బాబు, వినాయక నగర్ డివిజన్ బిజెపి ప్రెసిడెంట్ ఓం ప్రకాష్ , డివిజన్ నాయకులు సాయి సురేష్ , సైనిక్ విహార్ కాలనీ అసోసియేషన్ సభ్యులు అనేక మంది భారతీయ జనతా పార్టీ నాయకులు, మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.. అనంతరం మహిళలకు కార్పొరేటర్ రాజ్యలక్ష్మి , గీత మూర్తి జన ఔషధీ కేంద్రాల నిర్వహకులు గోపు లక్ష్మీ శానిటరీ ఫ్యాట్స్ పంపిణీ చేశారు.

---





## కాప్రా కందిగూడలో వైభవంగా బోనాల పండుగ....

**తెలంగాణవీణ, కాప్రా:** కాప్రా సర్కిల్ పరిధిలోని కందిగూడలో బోనాల పండుగ వైభవంగా నిర్వహించారు. పురాతన చరిత్ర కలిగిన కందిగుడ అమ్మవారి ఆలయంలో ఆదివారం బోనాల పండుగ అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహంకాళి అమ్మ ప్రధాన ఆలయంగా నల్ల పోచమ్మ, రేణుక ఎల్లమ్మ తో పాటు నాగదేవత, గణపతి, శివలింగాలు ఆలయంలో కొలువై ఉన్నాయి. ఆలయ ప్రాంగణానికి పక్కనే బొడ్రాయి, ఎల్లమ్మ ఆలయం లో ఆదివారం అమ్మవార్లకు భక్తులు బోనాలు సమర్పించి మెక్కులు తీర్చుకున్నారు. వందల ఎల్లనాటి రాగి, వేప చెట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. బోనాల సందర్భంగా ఆలయాన్ని రంగురంగు విద్యుత్ దీపాలతో అలంకరించారు. . భక్తులకు ఎలాంటి ఆసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. తెలుగు, తమిళ సంప్రాదాయలతో అమ్మవారి బోనాల ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు.

## బూర మల్లేశంను గెలిపించుకుంటాం

**- సిరిసిల్ల పద్మశాలిల తీర్మానం**



తెలంగాణా వీణ/హైదారాబాద్: హుజూరాబాద్.సిరిసిల్ల జిల్లాల్లో పద్మశాలి రాష్ట్ర అధ్యక్ష పదవికి పోటీలో ఉన్న బూర మల్లేశం ను ఎలాగైనా గెలిపించుకుంటామని సిరి సిల్ల పద్మశాలి కుల సంఘాల నాయకులు హామీ ఇచ్చారు.ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా బూర మల్లేశం ను శాలువాతో సన్మానించారు.పద్మశాలి సంఘాలకు మల్లేశం రాష్ట్ర అధ్యక్షులుగా గెలిచిన తర్వాత తప్పకుంటా సమస్యలు పరిష్కరిస్తారని నమ్మకం ఉందని అందుకు అందరం కట్టుబడి ఉండి మెజారిటీ తో గెలిపిస్తమని హామీ ఇచ్చారు.

## విగ్రహా ప్రతిష్ట మహోత్సవం ప్రారంభం: మాజీ ఎమ్మెల్యే

**తెలంగాణ వీణ/మల్కాజ్గిరి:** ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరినట్లు మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు తెలిపారు . ఆదివారం నేరేడ్మెట్ డివిజన్ పరిధిలోని ఆర్ కె పురం లోని సంతోష్ కాలనీలోని నల్ల పోచమ్మ దేవాలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి మాట్లాడుతూ మల్కాజ్గిరి ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని భగవంతుని ప్రార్ధన చేస్తున్నట్లు తెలిపారు.కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, చెన్నారెడ్డి, యాదగిరి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు





## ప్రతి ఇంటిమీద త్రివర్ణ పతాకాన్ని ఎగరవేయాలి

### - దేశభక్తిని ప్రతి ఒక్కరు చాటాలి: రామకోటి రామరాజు




**తెలంగాణ వీణ/ సిద్దిపేట జిల్లా** :స్వాతంత్ర దినోత్సవం ఆగస్టు 15న ప్రతి ఒక్కరు జాతీయ జెండాలను ఎగరావేయాలని జాతీయ జెండాలను ఆదివారం నాడు ఆవిష్కరించి పిలుపునిచ్చారు సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణానికి చెందిన శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక, అధ్యక్షులు, భక్తిరత్న, కళారత్న, సేవారత్న అవార్డు గ్రహీత రామకోటి రామరాజు ఈ సందర్భంగా మాట్లాడుతూ ముచ్చటైన మన మూడు రంగులంజెండాను మన ఇంటి పై ఎగరవేసి ప్రతి ఒక్కరు కూడ దేశభక్తి చాటాలన్నారు. ప్రతి వ్యక్తిలోనూ దేశభక్తి ఉప్పొంగాలన్నారు. భిన్నత్వంలో ఏకత్వం మన దేశం అన్నారు. సర్వ మతాలకు మన దేశం పుట్టినిల్లు అన్నారు. ఈ నెల 13నుండి 15వరకు ప్రతి ఇంటి పై త్రివర్ణ పతకాన్ని ఎగరవేయాలన్నారు.ఈ కార్యక్రమంలో అమృత క్లినిక్ అధినేత వేములవాడ కనకచారి, రాజకుమార్, భాస్కర్, మల్లేశం, లక్ష్మీ నర్సయ్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## యాదగిరిగుట్ట కొండపైన పుష్కరిణి, స్వామి వారి అఖండ దీపం ప్రారంభోత్సవం చేసిన ఎమ్మెల్యే బీర్లఐలయ్య







**తెలంగాణ వీణ/యాదగిరిగుట్ట:** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట కొండపైన విష్ణు పుష్కరిణి,అఖండ దీపాన్ని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రారంభించారు. ముందుగా స్వామివారి వద్ద సంకల్పపూజ చేసి స్వామి వారి పుష్కరిణిలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అనిత, దంపతులు సంకల్ప స్నానం చేశారు.ఆ తర్వాత స్వామి వారి అఖండ దీపంన్నీ ప్రారంభించారు.అనంతరం ఆలయంలో శ్రీ లక్ష్మి నరసింహస్వామి వారి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు ఆశీర్వ చనంచేశారు.ఆలయ అధికారులు లడ్డు ప్రసాదం అందజేసారు.

## నాచారంలో మాదిగల ఐక్యత ర్యాలీ

**తెలంగాణ వీణ/నాచారం:** గౌడేల్లి రామ కృష్ణ మాదిగ నల్ల బాబు మాదిగ ఆధ్వర్యంలో నాచారం 6 వ డివిజన్ లో ఆదివారం మాదిగల ఐక్యత ర్యాలీ నిర్వహించారు. 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం చేసి మాదిగలకు మాదిగ ఉపకులలకు న్యాయం అందించిన మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేసి నాచారం డివిజన్ లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఏర్పుల నాగరాజు, పొన్నాల మహిందెర్ మాదిగ ఏముల హరిబాబు మాదిగ,కొమ్మగల్ల నవీన్ మాదిగ, కొరపాక అంజి మాదిగ, శ్రీముర్తి నాగరాజు మాదిగ,యాఖస్వామి మాదిగ,యాల సంతోష్ మాదిగ,వేముల మారేయ్య మాదిగ,టేకులపల్లి రామచందర్, ఏర్పుల నర్సింగ్ రావు మాదిగ, దాసరి కర్ణ, దేవులపల్లి యాదగిరి మాదిగ,మాకుల సంజన్న మాదిగ తదితరులు పాల్గొన్నారు.



# పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్లో ఘనంగా ఇన్వెస్టిచర్ వేడుక..

**తెలంగాణ వీణ/ఉప్పల్:** సాగర్ రోడ్ లోని పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఇన్వెస్టిచర్ వేడుక పాఠశాల అసెంబ్లీ హాలులో అత్యంత ఉత్సాహంగా జరిగింది. నూతనంగా ఎన్నికైన విద్యార్థి మండలి సభ్యులకు పాఠశాల నాయకులుగా బాధ్యతలు ఈ వేడుకలో అప్పగించారు. ఈ వేడుకలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాఠశాల క్యాలెండర్లో ముఖ్యమైన సంప్రదాయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అడిషనల్ డిప్యూటీ కమీషనర్ ఆఫ్ పోలీస్ ఎస్ ఓ టి రాచకొండ కమిషనరేట్ డాక్టర్ నరసింహా రెడ్డి నంద్యాల పాల్గొన్నారు. ఇతర విశిష్ట అతిథులలో డైరెక్టర్లు రాజ్ శేఖర్ రెడ్డి, నిహారిక రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ పీఎస్ఎల్ రత్నమాల ఉన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఇందులో పాఠశాల గీతం, శ్రావ్యమైన సమూహ గీతం.. నాయకత్వం, ఐక్యత స్ఫూర్తిని తెలియజేశాయి.సాంస్కృతిక కార్యక్రమం తరువాత ప్రధాన ఇన్వెస్టిచర్ కార్యక్రమం జరిగింది. ఇందులో విద్యార్థి





మండలికి సాషెస్, జెండాలు, డ్యూటీ బ్యాడ్జలను అందజేశారు. స్టూడెంట్ కౌన్సిల్లో పాఠశాల ప్రిఫెక్ట్లు, ప్రీ-ప్రైమరీ ప్రిఫెక్ట్లు, స్పోర్ట్స్ సెక్రటరీలు, డిసిప్లైన్ సెక్రటరీలు, గ్రీన్ గ్యారీసన్స్, కల్చరల్ సెక్రటరీ, లిటరరీ సెక్రటరీ, హౌస్ ప్రిఫెక్ట్లు (కావేరి, గంగా, గోదావరి, కృష్ణా) ఉన్నారు. పాఠశాల విలువలు, నియమాలను పాటిస్తామని, అంకితభావం, నిజాయితీ, చిత్తశుద్ధితో తమ విధులను నిర్వర్తిస్తామని ప్రతిజ్ఞ చేస్తూ కౌన్సిల్ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథి ప్రమాణ స్వీకారం చేయగా,





విద్యార్థులు ఆయన తర్వాత మాటలను పునరావృతం చేయడంతో సభా ప్రాంగణమంతా నిబద్ధతతో ప్రతిధ్వనించింది. అనంతరం ముఖ్య అతిథి ప్రసంగిస్తూ నూతనంగా ఎన్నికైన నాయకులను అభినందిస్తూ వారిని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.స్కూల్ ప్రిఫెక్ట్ యశ్వంత్ పంచుకున్న కొన్ని మాటలు, స్కూల్ ప్రిఫెక్ట్ హారిక కృతజ్ఞతలు తెలపడంతో కార్యక్రమం ముగిసింది.

# వంజరి కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాను... ఎంపీ ఈటల రాజేందర్

**తెలంగాణ వీణ/తార్నాక:** తెలంగాణ వంజరి సంఘం కులస్తుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎంపీ ఈటల రాజేందర్ హామీ ఇచ్చారు. తార్నాక లోని తెలంగాణ వంజరి సంఘం ఆహ్వానం మేరకు రాష్ట్ర కార్యాలయానికి వచ్చిన పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ మాట్లాడుతూ వంజరి కులస్తులు సంక్షేమం అభివృద్ధి కోసం అందరూ ఐక్యంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయనకు వంజరికులస్తులు వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినపత్రం అందించారు. గతంలో ఎస్టీ జాబితాలో ఉన్న వంజరులను అకారణముగా కారణం లేకుండా తొలగించి బీసి లో చేర్చారని తిరిగి వారిని ఎస్ టీ. లో పునరుద్ధరించాలని కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించి వారికి న్యాయం



చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశములో మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, కాలేరు నరేందర్ అధ్యక్షులు, కందారి వెంకటేశం ప్రధాన కార్యదర్శి కాలేరు అమరేందర్ కోశాధికారి



ముఖ్యసలహాదారు సాల్వేరు ముత్తయ్య ,కాలేరు సురేందర్ ,ప్రవీణ్ ,బానుక మల్లికార్జున్,విజయ్ కుమార్,ఆంజనేయులు,సత్యం,రాజు జిల్లాల నుండి కులస్తులు పాల్గొన్నారు.

## కుటుంబ సమేతంగా యాదగిరిగుట్ట ప్రదక్షిణలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య






**తెలంగాణ వీణ/యాదగిరిగుట్ట:** యాదాద్రి భువనగిరి జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి వారి యాదగిరిగుట్టలో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య స్వాతి నక్షత్రం సందర్భంగా కుటుంబ సమేతంగా సామూహిక గిరిప్రదక్షిణలో పాల్గొన్నారు.ఈ గిరిప్రదక్షిణలో తెలంగాణ రాష్ట్ర నలుమూలల నుండి ఆలేరు నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.ముందుగా పాదాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి,జై బోలో లక్ష్మీనరసింహస్వామి అంటూ,భజనలు చేస్తూ,యధా ఋషి వద్ద నమస్కరించి ఈ గిరిప్రదక్షిణ కొనసాగించారు.



## టిపిసిసి అధ్యక్ష పదవి బీసీలకు ఇవ్వాలి: జాజుల లింగంగౌడ్



**తెలంగాణ వీణ/ఉప్పల్:** జనాభాలో సగానికి పైగా ఉన్నటువంటి బీసీలకు టిపిసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు..ఈ మేరకు ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గెలుపు గుర్రాల పేరుతో గతంలో జరిగిన ఎమ్మెల్యే,ఎంపీ టికెట్ల కేటాయింపులో బీసీలకు అన్యాయం చేశారని,కార్పొరేషన్ ఛైర్మన్ పదవులలో కూడా బీసీల జనాభా తగ్గట్టు ప్రాతినిధ్యం లేదని అన్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో ఓసి ముఖ్యమంత్రిని నియమించారని,ఎస్సీ ని ఉప ముఖ్యమంత్రిగా నియమించినందున కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం పాటించి బీసీలకు సముచిత స్థానం కల్పించాలని పేర్కొన్నారు.జాతీయ కాంగ్రెస్కి బీసీ సంక్షేమ సంఘం ద్వారా బీసీలకు అధ్యక్ష పదవి ఖచ్చితంగా ఇవ్వాల్సిందేనని విజ్ఞప్తి చేస్తున్నట్లు లింగంగౌడ్ పేర్కొన్నారు.

G9 TV తెలుగు
తెలంగాణ వీణ
For Advertisements
8328209811
Flat No 204,
Mythri Appartments,
Opp BSNL Office, ECIL




# ధోనిపై బీసీసీఐ ఫిర్యాదు.. ఎథిక్స్ కమిటీ నుంచి నోటీసులు

భారత మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీకి న్యాయపరమైన చిక్కులు ఎదురవవుతున్నాయి. లెజెండరీ క్రికెటర్ ధోనిపై బిసిసిఐకి అధికారిక ఫిర్యాదు దాఖలైంది. ఉత్తరప్రదేశ్, అమేథికి చెందిన రాజేష్ కుమార్ మౌర్య అనే ఫిర్యాదుదారుడు బీసీసీఐ ఎథిక్స్ కమిటీలోని రూల్ 39 కింద మాజీ కెప్టెన్‌పై పలు అభియోగాలు మోపారు.దీనిపై స్పందించాల్సిందిగా భారత మాజీ కెప్టెన్‌కు ఎథిక్స్ కమిటీ 19 రోజుల గడువిచ్చింది.ఈ కేసు ధోని- ఆర్కా స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ సంస్థ, దాని డైరెక్టర్లు మిహిర్ దివాకర్ మధ్య కొనసాగుతున్న రూ. 15 కోట్ల వివాదానికి సంబంధించినది అయినప్పటికీ, ఆ కేసులో అభియోగాలు మాజీ కెప్టెన్‌పై మోపబడలేదు. క్రికెటర్‌గా ధోని జాతీయ జట్టులో కొనసాగుతున్న సమయంలో బీసీసీఐ రూల్స్ అండ్ రెగ్యులేషన్స్‌లోని రూల్ రూల్ 38(4)ని ఉల్లంఘించి, ఒప్పందాలు చేసుకున్నాడని ఫిర్యాదుదారు బీసీసీఐ ఎథిక్స్ కమిటీ దృష్టికి తీసుకొచ్చారు. **ఆగస్టు 30 గడువు...** రాజేష్ కుమార్ మౌర్య ఫిర్యాదుపై అధికారిక ప్రతిస్పందన ను దాఖలు చేయాలని బీసీసీఐ ఎథిక్స్ కమిటీ ధోనీకి ఆగస్ట్ 30, 2024 వరకూ గడువిచ్చింది. అలాగే, ధోని రివర్ట్‌పై అధికారిక ప్రతిస్పందనను సమర్పించడానికి రాజేష్ కుమార్ మౌర్యకు సెప్టెంబర్ 16, 2024 వరకు సమయమిచ్చింది. ఈ కేసుపై సెప్టెంబర్ 16న విచారణ జరగనుంది.కాగా, ఐపీఎల్ 17వ సీజన్‌లో ధోని చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు ఫినిషర్‌గా మంచి ఇన్నింగ్స్ లు ఆడాడు. అయితే, మోకాలి గాయం కారణంగా ఎక్కువ సేపు బ్యాటింగ్ చేయలేక చివరి రెండు, మూడు ఓవర్లలోనే బ్యాటింగ్ కు వచ్చేవాడు. ఈ నేపథ్యంలో 18వ సీజన్‌లో మహీ ఆడడంపై సందేహాలు నెలకొన్నాయి. వచ్చే ఏడాది ఐపీఎల్ మెగా వేలం ఉంది. అందుకని ధోనీని అన్‌క్యాప్డ్ ప్లేయర్‌గా కొనసాగించాలా? అనే విషయమై సీఎస్కే యాజమాన్యం తర్జనభర్జన పడుతోంది.

# 'అమె నాకూ అమ్మే'.. పాకిస్థాన్ అథ్లెట్ కామెంట్స్ వైరల్






పారిస్ ఒలింపిక్స్‌లో స్వర్ణంతో చరిత్ర సృష్టించిన అర్షద్ నదీమ్ కు స్వదేశంలో ఘన స్వాగతం లభించింది. ఒలింపిక్ విజేతగా పాకిస్థాన్‌లో అడుగుపెట్టిన అతడికి పెద్ద సంఖ్యలో జనం నీరాజనాలు పలికారు.అనంతరం మీడియాతో మాట్లాడిన నదీమ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. భారత జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా తల్లి సరోజ్ దేవీపై ప్రశంసలు కురిపించాడు. ఆమె తనకు కూడా తల్లి అని నదీమ్ తెలిపాడు."ఒక అమ్మ ప్రతి ఒక్కరికీ అమ్మే. అందుకనే అమే ప్రతిఒక్కరి కోసం ప్రార్థిస్తుంది. నీరజ్ చోప్రా తల్లికి నేను ఎంతో కృతజ్ఞుడిని. ఆమె నాకు కూడా అమ్మనే. ఎందుకంటే ఆమె నా విజయం కోసం కూడా పూజలు చేసింది. దక్షిణ ఆసియా నుంచి ప్రపంచ వేదికపై అత్యుత్తమ ప్రదర్శన చేసింది నీరజ్, నేను ఇద్దరమే' అని నదీమ్ వెల్లడించాడు. **రికార్డు దూరంతో పసిడి...**ఒలింపిక్స్‌లో రికార్డు త్రోతో నదీమ్ స్వర్ణ పతకం కొల్లగొట్టాడు. ఫైనల్లో 92.97 మీటర్ల దూరం ఈటెను విసిరి పాక్‌కు తొలి పసిడిని అందించాడు. ఇక టోక్యో ఒలింపిక్స్‌లో పసిడిని ముద్దాడిన నీరజ్.. పారిస్‌లో రజతంతో సరిపెట్టుకున్నాడు. ఫైనల్లో భారత స్టార్ అథ్లెట్ 89.45 మీటర్ల దూరం బడిసెను విసిరి వరుసగా రెండో పతకంతో చరిత్ర లిఖించాడు.ఒలింపిక్స్ జావెలిన్ త్రో ఫైనల్ తర్వాత నీరజ్ చోప్రా తల్లి సరోజ్ దేవీ సంచలన వ్యాఖ్యలు చేసింది. భారత్, పాక్ మధ్య శతృత్వం కొనసాగుతున్న పరిస్థితుల్లో ఆమె తన ప్రేమగుణంతో సరిహద్దులు చెరిపేసింది. 'సిల్వర్ వచ్చినందుకు సంతోషంగా ఉంది. పసిడి పతకం గెలిచిన నదీమ్ కూడా మాబిడ్డనే' అని సరోజ్ అంది. దాంతో, ఒక్కసారిగా ఆమె ఇంటర్నెట్‌లో సెన్సేషనల్ అయింది. అటు నదీమ్ తల్లి రజియా పర్వీన్ సైతం నీరజ్ తనకు కుమారుడితో సమానమని చెప్పింది. 'అతడు నదీమ్ స్నేహితుడు. అంతేకాదు ఒక సోదరుడి లెక్క' అని పర్వీన్ అంది. దాంతో, ఈ ఇద్దరు తల్లుల విశాల హృదాయన్ని భారత్, పాక్ ప్రజలు వేనోళ్ల పొగుడుతున్నారు.

# పారిస్ ఒలింపిక్స్‌లో భారత్.. నమోదైన రికార్డులు.. త్రుటిలో చేజారిన పతకాలు







**ఇంటర్నెట్ డెస్క్:** పారిస్ ఒలింపిక్స్‌లో భారత అథ్లెట్ల పోరాటం ముగిసింది. ఈ సారి విశ్వక్రీడల్లో భారత్ తరఫున 16 క్రీడాంశాల్లో 117 మంది పోటీపడగా..కనీసం 10 పతకాలైనా వస్తాయని అభిమానులు ఆశించారు. భారీ అంచనాలతో బరిలోకి దిగిన కొంతమంది అథ్లెట్లు నిరాశపర్చగా.. మరికొందరు త్రుటిలో పతకాలు చేజార్చుకున్నారు. ఊరించి ఊరించి చివరికి ఆరు పతకాలతో సరిపెట్టుకుంది భారత్. ఇందులో ఐదు కాంస్యాలు, ఒక రజత పతకాలున్నాయి. పతకాల సంఖ్య తక్కువగానే ఉన్న ఈ ఒలింపిక్స్‌లో మనోళ్లు పలు కొత్త రికార్డులు నెలకొల్పి చరిత్ర సృష్టించారు. **చరిత్ర సృష్టించిన మను బాకర్...** ఈ ఒలింపిక్స్‌లో షూటింగ్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో మను బాకర్ కాంస్య పతకం దక్కించుకుంది. దీంతో విశ్వక్రీడల్లో పతకం సాధించిన తొలి భారత మహిళా షూటర్‌గా రికార్డు సృష్టించింది. మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లోనూ సరబ్‌జ్యోత్‌తో కలిసి కాంస్యం సాధించిన మను.. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన తొలి అథ్లెట్‌గా నిలిచింది. **అత్యధికంగా ఒకే విభాగంలో మూడు పతకాలు...** షూటర్ స్వప్నిల్ కుశాలె 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ ఈవెంట్‌లో కాంస్య పతకం అందుకున్నాడు. ఈ విభాగంలో భారత్ పతకం సాధించడం ఇదే తొలిసారి. భారత్ ఒక ఒలింపిక్స్‌లో ఒకే క్రీడాంశంలో మూడు పతకాలు అందుకోవడం కూడా మొదటిసారి కావడం విశేషం. లండన్ ఒలింపిక్స్‌లో షూటింగ్‌లో వినయ్ కుమార్ (రజతం, 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్), గగన్ నారంగ్ (కాంస్యం, 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్).. టోక్యో ఒలింపిక్స్‌లో రెజ్లింగ్‌లో రవిదహియా (57 కేజీలు), బజరంగ్ పునియా (65 కేజీలు) పతకాలు సాధించారు. **అథ్లెటిక్స్‌లో ఒక్కడే...** టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించిన భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా.. ఈ సారి రజత పతకం దక్కించుకున్నాడు. దీంతో ఒలింపిక్స్‌లో అథ్లెటిక్స్‌లో వరుసగా రెండు పతకాలు సాధించిన క్రీడాకారుడిగా నీరజ్ రికార్డు సృష్టించాడు. ఓవరాల్‌గా వరుసగా రెండు ఒలింపిక్ ఎడిషన్లలో పతకం సాధించిన మూడో భారత అథ్లెట్‌గా నిలిచాడు. అతని కంటే ముందు రెజ్లర్ సుశీల్ కుమార్, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు ఈ ఘనత సాధించారు. **52 ఏళ్ల తర్వాత...**ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన భారత హాకీ జట్టు.. ఈ సారి కూడా కాంస్యం అందుకుంది. దీంతో విశ్వక్రీడల్లో హాకీలో భారత్ పతకాల సంఖ్య 13కి చేరింది. భారత జట్టు 52 ఏళ్ల తర్వాత వరుసగా కాంస్య పతకాలు సాధించడం ఇదే తొలిసారి. అంతకు ముందు 1968, 1972లో టీమ్‌ఇండియా మూడో స్థానంలో నిలిచింది. **పిన్న వయస్కుడిగా అమన్...** ఈ ఒలింపిక్స్‌లో పురుషుల విభాగంలో పోటీ పడిన ఏకైక రెజ్లర్ అమన్ సెహ్రావత్. తిరుగులేని ఆటతో ఆశలు రేపినా అతడు సెమీస్‌లో భంగపడ్డాడు. చివరకు కాంస్య పతకం సాధించి రెజ్లింగ్‌లో ఈ సారి భారత్‌కు పతకాన్ని అందించాడు. ఒలింపిక్స్‌లో వ్యక్తిగత పతకం గెలిచిన అతి పిన్న వయస్సు (21 ఏళ్ల 24 రోజులు) భారత అథ్లెట్‌గా అతను చరిత్ర సృష్టించాడు. పీవీ సింధు (2016లో రజతం గెలిచినప్పుడు 21 ఏళ్ల 1 నెల 14 రోజులు) నెలకొల్పిన రికార్డును తిరగరాశాడు. **త్రుటిలో చేజారిన పతకాలు...** 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో అర్జున్ బబుతా కనీసం రజత పతకం సాధిస్తాడని అంతా భావించారు. కొద్దిలో నాలుగో స్థానానికి పడిపోయి కాంస్య పతకాన్ని మిస్ చేసుకున్నాడు. మను బాకర్ కూడా 25 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో నాలుగో ప్లేస్‌లో నిలిచి త్రుటిలో పతకాన్ని చేజార్చుకుంది. స్కీట్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత షూటర్లు మహేశ్వరి చౌహాన్, అనంత్‌జిత్ సింగ్ ఒక్క పాయింట్‌తో కాంస్య పతకానికి దూరమయ్యారు. ఆర్చరీలో మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో బొమ్మదేవర ధీరజ్, అంకిత నాలుగో స్థానంతో సరిపెట్టుకున్నారు. వెయిట్ లిఫ్టింగ్‌లో టోక్యో ఒలింపిక్స్‌లో రజతం సాధించిన మీరాబాయి చాను ఈ సారి నిరాశపర్చింది. నాలుగో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని చేజార్చుకుంది. **లక్ష్యసేన్ కొత్త చరిత్ర...** పారిస్ ఒలింపిక్స్‌లో స్టార్ షట్లర్ లక్ష్యసేన్ కొద్దిలో కాంస్యాన్ని మిస్ చేసుకున్నాడు. పురుషుల విభాగంలో సెమీస్ చేరిన భారత ఆటగాడిగా రికార్డు సృష్టించిన అతడు.. అక్కడ విక్టర్ అక్సెల్సెన్ (డెన్మార్క్) చేతిలో ఓడాడు. కాంస్య పతక పోరులో చివరి వరకూ పోరాడి మలేషియా ఆటగాడు లీ జి జియా చేతిలో పరాజయం చవిచూశాడు. **భారతావనిని నిరాశలో ముంచెత్తిన '100 గ్రాములు'...** రెజ్లింగ్‌లో వినేశ్ ఫొగాట్ ఫైనల్‌కు చేరడంతో పతకం వస్తుందని యావత్ భారతావని సంబరపడింది. కానీ, 100 గ్రాముల బరువు ఎక్కువన్న కారణంగా స్వర్ణ పతక పోరుకు ముందు వినేశ్ అనర్హతకు గురైంది. ఈ వార్త యావత్ భారతావనిని తీవ్ర నిరాశకు గురి చేసింది. ఆమెకు ప్రధాని మోదీ దగ్గరి నుంచి కింది స్థాయి నేతల వరకూ అండగా నిలిచి ఓదార్పు నిచ్చారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఆమె రెజ్లింగ్‌కు గుడ్‌బై చెప్పింది. వినేశ్ రజత పతకం కోసం కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఆఫ్ స్పోర్ట్‌ను ఆశ్రయించింది. ఈ అప్పీల్‌పై ఆగస్టు 13న తీర్పు వెలువడనుంది.




# ఈఫిల్ టవర్ ఎక్కిన ఓ వ్యక్తి.. అలర్ట్ అయిన పోలీసులు



కాసేపట్లో పారిస్ ఒలింపిక్స్ ముగింపు వేడుకలు ప్రారంభం కానున్నాయి. అయితే.. ఈ కార్యక్రమానికి ముందు పారిస్‌లో ఒలింపిక్ నిర్వాహకులు ఊహించని సంఘటన జరిగింది. పారిస్‌లోని చారిత్రక ఈఫిల్ టవర్‌ను ఓ వ్యక్తి అధిరోహించాడు. దీంతో అధికారులు హడావుడిగా ఈఫిల్ టవర్ ప్రాంతం చుట్టూ ఉన్న వారిని అక్కడి నుంచి పంపించారు.మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ఓ వ్యక్తి చొక్కా ధరించకుండా టవర్‌ను ఎక్కుతూ కనిపించాడు. అయితే.. అతను ఎటు వైపు నుంచి ఎక్కాడో తెలియలేదు. మొదటిసారి చూసినప్పుడు డెక్ పైన, రెండోసారి ఒలింపిక్ రింగుల పైన కనిపించాడు. పారిస్ ఒలింపిక్స్ 2024 ముగింపు వేడుక సెయింట్ డెనిస్‌లోని స్టేడ్ డి ఫ్రాన్స్‌లో రాత్రి 9 గంటలకు ప్రారంభం కానుంది. ఈ ప్రదేశం ఈఫిల్ టవర్‌కు చాలా దూరంలో ఉంది.కాగా.. పారిస్‌లో ఒలింపిక్ ముగింపు వేడుకల దృష్ట్యా 30,000 మంది పోలీసులను మోహరించారు. ఫ్రాన్స్ అంతర్గత మంత్రి గెరాల్డ్ దర్మానిన్ మాట్లాడుతూ.. స్టేడ్ డి ఫ్రాన్స్ చుట్టూ సుమారు 3,000 మంది పోలీసు అధికారులను సమీకరించనున్నట్లు తెలిపారు. అలాగే పారిస్, సెయింట్-డెనిస్ ప్రాంతంలో 20,000 మంది పోలీసు దళాలు, ఇతర భద్రతా సిబ్బంది ఉండనున్నట్లు పేర్కొన్నారు.

# క్రికెట్ మైదానంలో విషాదం.. విద్యుదాఘాతానికి గురై బాలుడి మృతి

దేశ రాజధాని ఢిల్లీలో విద్యుదాఘాతానికి గురై 13 ఏళ్ల బాలుడి మృతి చెందాడు. రన్‌హోలా ప్రాంతంలోని కోట్లా విహార్ ఫేజ్-2లో క్రికెట్ ఆడుతున్న బాలుడు కరెంటు సరఫరా అవుతున్న ఇనుప స్తంభాన్ని తాకి అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. బాలుడికి కరెంట్ షాక్ తగిలిందన్న విషయం తెలిసిన చుట్టుపక్కల వాళ్లు హుటాహుటిన సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. బాలుడు అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలిసిన బాలుడి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. విద్యుదాఘాతానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. సకాలంలో తమ కుమారుడిని రక్షించేందుకు ఎవరూ ముందుకు రాలేదని వాపోయారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు. ఈ ఘటన శనివారం? మధ్యాహ్న సమయంలో చోటు చేసుకుంది.



# లిప్ లాక్ సీన్స్.. చాలా అవకాశాలు కోల్పోయాను: మృణాల్ ఠాకూర్



## రాజస్థాన్‌లో మహేశ బాబు ఫ్యామిలీ.. స్పెషల్ అట్రాక్షన్‌గా సితార..

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేశ్ బాబు ఇటీవలే తన పుట్టిన రోజు (ఆగస్టు 09)ను గ్రాండ్ గా సెలబ్రేట్ చేసుకున్నాడు. ఈ సందర్భంగా పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు, నెటిజన్లు సూపర్ స్టార్ కు ర్త్ డే విషెస్ చెప్పారు.ఇదిలా ఉంటే ప్రస్తుతంమహేశ్ బాబు ఫ్యామిలీ రాజస్థాన్ లో సేద తీరుతోంది.మహేశ్ బాబు సతీమణి నమ్రతా శిరోద్కర్, కూతురు ఘట్టమనేని సితార, కుమారుడు గౌతమ్ లు రాజస్థాన్ పర్యటనకు వెళ్లారు. వారి వెంట స్నేహితులు కూడా ఉన్నారు.రాజస్థాన్ లోని పలు పర్యాటక ప్రదేశాలతో పాటు షాపింగ్ చేస్తూ ఫొటోలకు పోజులిచ్చారు. ప్రస్తుతం మహేశ్ ఫ్యామిలీ రాజస్థాన్ వెకేషన్ కు సంబంధించిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో బాగా వైరలవుతున్నాయి.కాగా మహేశ్ బాబు పుట్టిన రోజు వేడుకలు రాజస్థాన్ రాజధాని జైపూర్ లోనే జరిగినట్లు తెలుస్తోంది. వెకేషన్ ను పూర్తి చేసుకున్న వార ఆదివారం(ఆగస్టు 11) తిరిగి హైదరాబాద్ చేరుకున్నారుఇక ల విషయానికి వస్తే..ఈ ఏడాది సంక్రాంతికి గుంటూరు కారంతో అలరించిన మహేశ్ బాబు ఇప్పుడు రాజమౌళితో ఒక చేస్తున్నాడు.త్వరలోనే ఈ షూటింగ్ పట్టాలెక్కనుంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టుకు సంబంధించి ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతు న్నాయి.ఇక ఈ కోసమే మహేష్ తన పూర్తి లుక్‌ను మార్చేశారు

సీతారామంతో తెలుగు అడియన్స్ హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది హీరోయిన్ మృణాల్ ఠాకూర్. తొలి చిత్రంతోనే కథానాయికగా ప్రశంసలు అందుకున్న మృణాల్ ఆ తర్వాత మాత్రం తెలుగులో వరుస ఆఫర్స్ అందుకుంటూ స్టార్ డమ్ సొంతం చేసుకుంది.మొదట్లో బుల్లితెరపై పలు సీరియల్స్ చేసిన ఈ బెంగాలీ బ్యూటీ.. ఆ తర్వాత మాతృభాషతోపాటు హిందీలో పలు ల్లో నటించింది. హిందీలో సూపర్ 30, జెర్సీ చిత్రాల్లో నటించింది. తెలుగులో సీతారామం తో సీతామహాలక్ష్మి పాత్రతో మరింత దగ్గరయ్యింది.ఈ మూవీ తర్వాత హాయ్ నాన్న, ఫ్యామిలీ స్టార్ చిత్రాలతో సూపర్ హిట్స్ అందుకుంది. కానీ ఆతర్వాత తెలుగులో మృణాల్ కు అవకాశాలు తగ్గిపోయాయి. ఇటీవలే తమిళంలో హీరో శివకార్తికేయన్ కు జంటగా నటించే అవకాశం కూడా చేజార్చుకుందనే ప్రచారం జరిగింది.అయితే ఇప్పటివరకు హెూమ్లీ పాత్రలతో ప్రేక్షకులకు దగ్గరైన మృణాల్, కెరీర్ మొదట్లో లిప్ లాక్ సన్నివేశాల్లో నటించి తల్లిదండ్రులకు షాకిచ్చిందట. అలాంటి సన్నివేశాల్లో నటించడాన్ని మృణాల్ ఠాకూర్ తల్లిదండ్రులు తీవ్రంగా వ్యతిరేకించారట.దీంతో లిప్ లాక్ సన్నివేశాల్లో నటించకూడదని అనుకున్నారట. దీంతో పలు అవకాశాలను కోల్పోయానని అన్నారు. ఆ తర్వాత తల్లిదండ్రులను ఒప్పించి ముద్దు సన్నివేశాల్లో నటించడం తనకు అవసరమని తెలిపిందట.దీంతో లిప్ లాక్ సన్నివేశాల్లో నటించకూడదని అనుకున్నారట. దీంతో పలు అవకాశాలను కోల్పోయానని అన్నారు. ఆ తర్వాత తల్లిదండ్రులను ఒప్పించి ముద్దు సన్నివేశాల్లో నటించడం తనకు అవసరమని తెలిపిందట.



# తెలుగు ట్వీట్స్‌కు రిప్లై ఇవ్వట్లేదన్న అభిమాని: మాళవిక

**ఇంటర్నెట్ డెస్క్:** సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే హీరోయిన్ మాళవికా మోహనన్. తన కొత్త సినిమా ‘తంగలాన్’ ప్రమోషన్స్‌లో భాగంగా ఇప్పటికే పలుమార్లు అభిమానులతో ఎక్స్‌లో చిట్‌చాట్ నిర్వహించిన ఆమె..ఆదివారం మరోసారి వారితో చాట్ చేశారు. ఈ క్రమంలో తానెన్ని సార్లు ట్వీట్ చేసినా నటి నుంచి సమాధానం రాకపోవడంతో ‘మాళవిక.. తెలుగు ట్వీట్స్‌కు రిప్లై ఇవ్వట్లేదు’ అని ఓ అభిమాని కాస్త అసహనానికి గురయ్యాడు. అదే ట్వీట్‌లో ‘తంగలాన్’ మంచి విజయం అందుకోవాలని ఆకాంక్షించాడు. ఎట్టకేలకు సదరు అభిమాని ట్వీట్‌పై మాళవిక స్పందించారు. “అది నిజం కాదు. నా స్నేహితుల్లో కొంతమంది తెలుగువారే. తెలుగు ప్రజలంటే నాకు ఇష్టం. అందుకే తెలుగులో ఓ సినిమా (రాజాసాబ్: ప్రభాస్ హీరో) కూడా చేస్తున్నా. మీరంతా నన్ను ఆదరించాలి” అని కోరారు. మరికొన్ని క్వశ్చన్‌– ఆన్సర్స్ ఇవీ.. చెన్నైలో ఏ థియేటర్‌లో ‘తంగలాన్’ చూసేందుకు ప్లాన్ చేశారు? మాళవిక: ‘తంగలాన్’ ఫస్ట్ డే ఫస్ట్ షో చూడడం కోసం ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్నా. తప్పకుండా చెన్నైలోనే చూస్తా. ఏ థియేటర్‌లో చూడాలో సలహా ఇవ్వండి విక్రమ్ గురించి ఏమైనా చెబుతారా? మాళవిక: ఈ సినిమాలోని విక్రమ్ నటన చూసి అందరూ ఆశ్చర్యపోతారు. ఆయన యాక్టింగ్ అద్భుతం ఏ సినిమా కోసం బాగా కష్టపడ్డారు? మాళవిక: ‘తంగలాన్’ కోసం ఎక్కువగా శ్రమించా ఈ సినిమాలో మీరు విక్రమ్‌కు సోదరిగా నటించారని అనుకుం టున్నా. మాళవిక: కాదు మీ లక్ష్యం ఏంటి? మాళవిక: బోల్డ్, స్ట్రాంగ్ పెర్ఫామెన్స్ చేయాలి. సూపర్‌స్టార్ స్టేటస్ అందుకోవాలి బయోపిక్‌లో నటించే ఆసక్తి ఉందా? మాళవిక: పరుగుల రాణి పీటీ ఉష బయోపిక్‌లో నటించాలనేది నా డ్రీమ్. నేను ట్రాక్ రన్నర్‌గా ఉన్న సమయంలో ఆమె నుంచి ఎంతో స్ఫూర్తి పొందా ‘సర్దార్ 2’ గురించి చెప్పండి? మాళవిక: కార్తితో కలిసి నటించాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నా. ఈ చిత్రంతో కల నెరవేరింది. ప్రభాస్‌పై మీ అభిప్రాయం? మాళవిక: చిత్రీకరణలో పాల్గొన్న ప్రతిసారి రుచికరమైన ఆహారాన్ని అందిస్తారు.విక్రమ్ హీరోగా దర్శకుడు పా. రంజిత్ తెరకెక్కించిన చిత్రం ‘తంగలాన్’. స్వాతంత్ర్యానికి పూర్వం కోలార్ గోల్డ్ ఫీల్డ్స్‌లో జరిగిన పలు సంఘటనల ఆధారంగా తెరకెక్కించారు. ఈ నెల 15న విడుదల కానుంది. ఈ మూవీకి ప్రీక్వెల్ లేదా సీక్వెల్ చేసేందుకు అవకాశముందని విక్రమ్ ఇటీవల తెలిపారు. తర్వాతి భాగాన్ని తప్పకుండా చేస్తామని.. దీనికోసం నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నట్లు స్పష్టత ఇచ్చారు. నాలుగు భాగాలుగా రూపొందించే అవకాశం ఉందన్నారు.










## నటుడు మోహన్ బాబుతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు..



తిరుపతిలోని శ్రీ సాయినాథ్ నగర్‌లో ఏర్పాటుచేసిన మోహన్ బాబు యూనివర్సిటీ మొదటి స్నాతకోత్సవంలో ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించి అనంతరం విద్యార్థులకు గ్రాడ్యుయేట్ పట్టాలు అందించారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న ప్రతి విద్యార్థికి అభినందనలు తెలిపారు. ఇంతకాలం తల్లిదండ్రులు ఆర్థికంగా సపోర్ట్ చేయడంతో మీ విద్యాభ్యాసం కొనసాగింది.. ఇకనుంచి మీ జీవితంలో కొత్త అధ్యాయాలు ప్రారంభమవుతాయి. మీ మీద తల్లిదండ్రులు మా అందరి కోరిక మేరకు జాతి భవిష్యత్తుకు గొప్పగా ఉపయోగపడాలి మీరు విజయాలు సాధించాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. మీరు సాధించిన సర్టిఫికెట్లతో ఏ స్థానంలో ఉన్న మీతో పాటు పదిమందికి ఉపయోగపడేలా మీ జీవితం ఉండాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. ఒక్కడిగా బతకడం గొప్ప విషయం కాదు మనం బతుకుతూ 10 మందిని బతికించడం చాలా గొప్ప విషయం అన్నారు.




Published and Printed by Vulloju Srinivas On Behlf of Sri Veena Publications Printed at Telalangana Veena Flat NO: 204 Mythri Apartments, Opp Bsnl Office Ecil,Kapra,Med
Responsibble for Selection of News Under The PRB ACT, Phone Number: 040 35668720, RNI Reg N0: TELTEL/12280 Reproduction in Whole or in Part Without Written